

'వాల్టా' పలమనేరులో 'ఉల్టా'

- జోరుగా కలప అక్రమ రవాణా
- అంతరించిపోతున్న వృక్ష సంపద
- హైవేలు, గ్రామాల్లోకి వస్తున్న అడవి జంతువులు
- నిద్రావస్థలో చెక్‌పోస్టు అధికారులు

ప్రజాశక్తి- పలమనేరు

పాల డెయిరీలు, టింబర్స్ సామిల్లులోని చెట్ల దుంగలు, శతాబ్దాల కాలం నాటి చెట్లను తెగనరికి నిర్భయంగా ప్రధాన రహదారుల గుండా అక్రమార్కులు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా చెక్‌పోస్టుల వద్ద అధికారులు, అటవీశాఖ, రెవెన్యూ అధికారులు నిద్రావస్థలో ఉన్నారంటూ పట్టణ ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ యథేచ్ఛగా అక్రమంగా కలపను తరలిస్తున్నారు.

చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలో అటవీ చెక్‌పోస్టు అక్రమ రవాణాను పెంచిపోషిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. అక్రమంగా కలపను రవాణా చేయడాన్ని అదుపు చేయాలని ప్రభుత్వం చెబుతుంటే అటవీశాఖ అధికారులు మాత్రం స్మగ్లర్ల ఆటను మరింత ప్రోత్సహిస్తున్నట్లు ఉంది వారి విధి నిర్వహణ. ప్రభుత్వం చెట్లను యథేచ్ఛగా నరికి రవాణా చేయడాన్ని కట్టడి చేయడానికి చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. కానీ ప్రభుత్వం ఉద్దేశ్యం నీరుగారిపోతుంది. చెక్‌పోస్టుల దాటి అక్రమంగా కలప రవాణా జరుగుతూనే ఉంది అయినా పట్టించుకునే నాథుడే లేడని అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేలకూలుతున్న భారీ వృక్షాలు..

అక్రమార్కుల సొంత లాభార్జనకు భారీ వృక్షాలు నేలకూలుతున్నాయి. శతాబ్దాళ కాలం నాటి అతి పెద్ద చెట్లను సైతం అక్రమార్కులు దుంగలు నరికి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఇది గమనించిన కొందరు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా వారు ఆలస్యంగా వచ్చి చెట్లను లెక్కించి ట్రాక్టర్ లోడ్డుకు రూ.7,400లు కట్టించుకుని రసీదు ఇచ్చి విడిచిపెడుతున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదు. ఇలా అక్రమంగా కలపను తరలిస్తున్న ప్రతిసారి అటవీశాఖ అధికారులు చూసీచూడనట్లు వదిలేయడంతో అక్రమార్కులు రెచ్చిపోతూ దొరికినంత దోచుకుంటున్నారు. మామూళ్ల తీసుకుంటూ వారిని విడిచిపెట్టేస్తున్నారని కూడా ప్రజలు అధికారులపై మండిపడుతున్నారు.

చెట్లకు రక్షణ ఏదీ..

భారీగా చెట్లను నరికి వేయడం వలన చెట్ల పరిరక్షణ కరువైంది. దీని వలన పచ్చదనం, ప్రాణవాయువు తగ్గిపోతుంది, కాలుష్యం పెరిగి వాతావరణం సమతుల్యం దెబ్బతింటుంది. పలమనేరు పరిసరాల్లో అటవీ ప్రాంతం ఎక్కువ విస్తీర్ణం కలిగి ఉంది. చెట్లను విపరీతంగా నరికి తరలించడం వలన అడవుల విస్తీర్ణం తగ్గిపోతుంది. ఇక్కడ ఉంటున్న అడవి జంతువులు ఇంకా ఎక్కువగా పల్లెలు, పట్టణాల్లోకి వచ్చే ప్రమాదం లేకపోలేదు. ప్రస్తుత కాలంలోనే ఏనుగులు, పులులు, ఇతర అడవి జంతువులు ప్రధాన రహదారులు, గ్రామాలు, పట్టణాల్లోకి వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏనుగులు తరచూ వచ్చి పంట పొలాలను నాశనం చేయడంతోపాటు ఇటీవల చిరుతలు రోడ్డుపైకి రావడం గమనిస్తున్నాం. కాస్తూకూస్తో అడవి విస్తీర్ణం ఉండగానే జంతువుల ఇలా వస్తుంటే ఇక అడవులను పూర్తిగా నిర్వీర్యం అయితే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో మరి.



నేలకూలుతున్న భారీ వృక్షాలు..

వాల్టా చట్టం రెవెన్యూ చేతిలో ఉల్టా

ప్రభుత్వ స్థలాల్లో ఏపుగా పెరిగిన చెట్లను అక్రమార్కులు నరికి సొమ్ము చేసుకుంటున్నా ఆయా ఏరియాలో రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకపోవడం లేదు. వక్ష సంపద రోజురోజుకు తరిగిపోతుంది. వనసంరక్షణ ద్యేయం, నర్సరీలలో మొక్కలు పెంచేందుకు ఉపయోగించే ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నాయి. ప్రభుత్వ, అటవీ బీడు భూముల్లో మొక్కలునాటినా, ఇందుకోసం ప్రభుత్వ ధనం కోట్ల రూపాయలు ఏటా వెచ్చించినప్పటికీ ప్రయోజనం శూన్యమే అవుతోంది. ప్రకృతిని, వృక్ష సంపదను కాపాడటానికి ప్రభుత్వం తీసుకొచ్చిన వాల్టా చట్టం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వలన పలమనేరులో ఉల్టా అవుతోంది.

అటవీ శాఖలో అక్రమాలు

ఇదే అదునుగా భావించిన అటవీశాఖ అధికారులు కొంతమంది అక్రమార్కులకు అండగా నిలుస్తూ జేబులు నింపుకునే పనిలో పడ్డారనే విమర్శలున్నాయి. అక్రమ కలప రవాణాను అదాయ వనరుగా మల్చుకుని దొరికినంత దోచుకుంటున్నారు. ఇక చెక్‌పోస్టులు ఉన్నా నామమాత్రంగానేనని అటవీ శాఖాధికారులను ప్రజలు తప్పుపడుతున్నారు. ప్రధానంగా చింత, వేప కానుక, మద్ది, వివిధ రకాల నీడనిచ్చే భారీ చెట్లను, ఫలాలు అందించే చింత కానుగ, వేప చెట్లను తెగనరికి తరలించేస్తున్నారు. కాలుష్యాన్ని తగ్గించే చెట్లను నరికించి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్న వారికి మొక్కుబడిగానే జరిమానాల పేరుతో ఫారెస్టు అధికారులు ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలున్నాయి.

స్పందించని ఉన్నత అధికారులు

పలమనేరు పట్టణం, రూరల్ గంగవరం, వీకోట, కస్తూరి నగరం ప్రదేశాల్లో చెక్‌పోస్టులలో అక్రమంగా కలపను రవాణా చేస్తున్నా, అడవులు హరిస్తున్నా సంబంధిత ఉన్నతాధికారులు పట్టీపట్టనట్లు వ్యవహించడం దారుణం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిద్రమత్తును వీడి, వక్ష సంపదను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





పలమనేరు సరిహద్దులోని చెక్‌పోస్టు, ట్రాక్టర్‌లో తరలిపోతున్న అక్రమ కలప

ఈవీఎంలు, వివి ప్యాట్స్‌ల

ఫస్ట్ లెవెల్ చెకింగ్ పకడ్బందీగా చేయండి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్


ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈవీఎంలు, వివి ప్యాట్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ పకడ్బందీగా జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.షన్మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సచివాలయంలోని ఎలక్షన్ గోడౌన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 16వ తేదీ నుంచి నవంబర్ 10వ తేదీ వరకు ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఫస్ట్ లెవెల్ చెకింగ్‌లో 12మంది బెల్ కంపెనీ ఇంజనీర్లు పాల్గొంటున్నారని తెలిపారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్ సజావుగా పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమంలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నిర్వహించాలని అన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ కార్యక్రమం నిర్వహించేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు చేయడంతో చిన్న పొరపాట్లు జరగడానికి వీలు లేకుండా చూడాలన్నారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్‌ను ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను మాత్రమే అనుమతించాలన్నారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్ జరిగే ప్రాంతంలో సెల్ ఫోన్లు, కెమెరాలు, స్పై కెమెరాలు లాంటివి అనుమతించబడవని, ఇక్కడ విధులు నిర్వహించే సిబ్బంది కచ్చితంగా ఐడి కార్డును ధరించాల్సి ఉంటుందని అన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్‌డిఓ రేణుకా, డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ నాయుడు, ట్రైనీ డిప్యూటీకలెక్టర్ లక్ష్మీప్రసన్న, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ బ్యూలా, ఎన్నికల సెల్ సిబ్బంది ఉమాపతి, మనోజ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం...



ప్రజాశక్తి- యాదమరి: గ్రామీణప్రాంత ప్రజలకు అవగాహన కల్పించి బాల్యవివాహాలను నిర్మూలిద్దామని ఏపీఎం కల్పలత రెడ్డి అన్నారు. సోమవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొట్టాలం గ్రామంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. బాల్యవివాహాల నిరోధించడం కొరకు గ్రామపరిధిలోని అంగన్వాడీ ఐసిడిఎస్ సిబ్బంది వెలుగు మహిళా సమైక్య సిబ్బంది, గ్రామ ప్రజలతో కలిసి ప్రమాణం కార్యక్రమం చేశారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించుటలో స్వయం సహాయక సంఘాల, సభ్యుల పాత్రపై, గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ, ఎండి ఇంతియాజ్ బాల్యవివాహ రహిత ఆంధ్రపదేశ్‌ను తీర్చిదిద్దటంలో భాగంగా నేడు ప్రతిఒక్కరూ బాల్యవివాహల నిరోధించడం కొరకు మహిళా సంఘాల అధ్యక్షురాలతో కలిసి జూమ్ లింకు ద్వారా ప్రమాణ కార్యక్రమం నిర్వహించారు. కొట్టాలం గ్రామపంచాయతీ కార్యదర్శి నిర్మల, అంగన్వాడీ సిబ్బంది, సంఘమిత్రాలు, సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

శ్మశానంలో ఆక్రమణలు తొలగించాలని వినతి



ప్రజాశక్తి- చిత్తూరు: శ్మశాన స్థలం ఆక్రమణ తొలగించాలని యాదమరి మండలం కాశిరాళ్ల గ్రామపంచాయతీ పెరుమాళ్ళ పెంట ఆదిఆంధ్ర వాడ ప్రజలు చిత్తూరు ఆర్డీవో రేణుక కలిసి వినతి పత్రం అందజేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా వారు ఫిర్యాదు చేశారు. పెరుమాలపెంట ఏఏడబ్ల్యులో 25 కుటుంబాలు నివాసం ఉంటున్నామని, తమ గ్రామం నుండి శ్మశానానికి వెళ్లే దారి మూసివేశారని తెలిపారు. తాటి చెరువు సమీపంలోని శ్మశాన స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకొని వ్యవసాయం చేసుకుంటున్నారని శ్మశానస్థలంలోని ఆక్రమణలు తొలగించి దారి సౌకర్యం కల్పించాలని ఆర్డీవోను కోరారు.

అర్జీలకు తగిన ఎండార్స్మెంట్ ఇవ్వండి..: జెసి

ప్రజాశక్తి- చిత్తూరు

'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో అందిన అర్జీలకు తగిన ఎండార్స్మెంట్ ఇవ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీల పరిష్కారం పై, రీసర్వే, రెవెన్యూ సంబంధిత అంశాలపై జిల్లాస్థాయిలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులతో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల తహశీల్దార్‌లో వివిధ ప్రాధాన్యత అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంకి సంబంధించి వచ్చిన అర్జీలు బియాండ్ ఎస్–ఎల్‌ఏకి వెళ్లకూడదని నిర్ణీత సమయం లోపల అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని తగిన విధంగా ఎండార్స్మెంట్ ఇవ్వాలని తెలిపారు. రెవెన్యూకు సంబంధించి రీసర్వే, 22ఏలకు సంబంధించిన, రెవెన్యూ సంబంధింత అంశాలలో క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు సీసీఎల్‌ఏ నియమనిబంధనలకు లోబడి పనిచేయాలని, నియమ నిబంధనలను అతి క్రమించి పనిచేసిన వారిపై కఠినచర్యలు తప్పవని విధినిర్వహణలో బాధ్యత వ్యవహరించాలని తెలిపారు. ఈనెల 19న జగనన్నకు తోడు కార్యక్రమం ఉందని ఇందుకు సంబంధించి లబ్ధిదారుల ఈ– కేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని బీసీ వెల్ఫేర్ అధికారి రబ్బానీ బాషను జేసీ ఆదేశించారు. సచివాలయ సిబ్బంది పాఠశాల తనిఖీలలో భాగంగా వారికి కేటాయించిన అంశాలపై పూర్తిగా తనిఖీ చేయాలని, ఈ పని కచ్చితంగా జరిగేలా సంబంధిత జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ పద్మ నాభం, ఆర్ అండ్ బి ఎస్‌ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, డిఎస్‌ఓ శంకరన్ జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాజ్యలక్ష్మి, ఈడీఎస్సీ కార్పొరేషన్ నరసింహులు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, మెప్మా పిడి రాధమ్మ, ఎడి సర్వే గౌస్‌బాషా, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, డిఎల్‌డిఓ రవికుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

విద్యార్థులకు గైడ్లతో విద్యాబోధన ప్రోత్సహించకండి

డిప్యూటీ డీఈవో చంద్రశేఖర్



ప్రజాశక్తి- యాదమరి: విద్యార్థులకు గైడ్ల ద్వారా విద్యాబోధనను ప్రోత్సహించకండి అని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం యాదమరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు రోజుల క్రితం మండల కేంద్రానికి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ మండలంలో కొంతమంది విద్యార్థి ఇళ్లలో విద్యార్థులు ఎలా చదువుతున్నారని ఇళ్ల వద్దకు వెళ్లి ఆరా తీశారు. ఈ సందర్భంలో మండల కేంద్రంలోని ఓవిద్యార్థి గైడ్ల ద్వారా నోట్స్ విద్యను అభ్యసిస్తున్నట్టు గుర్తించారు. ఆయన వెంటనే గైడ్ ద్వారా విద్యా బోధన ఎవరు ప్రోత్సహిస్తున్నారని అలాంటి ఉపాధ్యాయులను గుర్తించి తమకు నివేదిక అందించాలని డిప్యూటీ డీఈవోను ఆదేశించారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని విద్యార్థి ఇంటిని పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గైడ్ల ద్వారా ఏ ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతిఒక్కరూ విద్యాబోధన సమయంలో గైడ్ల ద్వారా విద్యా బోధనను చేపట్టరాదని తెలిపారు. పాఠశాలకు సక్రమంగా రాని విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు తెలియజేసి సక్రమంగా వచ్చే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు నోట్స్‌ను నెలవారి పాఠ్యాంశాలను ఆ నెలలోపు విద్యార్థులకు క్షుణ్ణంగా వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. గైడ్స్ ద్వారా చదువు చెప్పే విధానానికి స్వస్తి పలకాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రతి విద్యార్థిలోని నైపుణ్యాన్ని వెలికి తీసి ఆత్మధైర్యాన్ని నింపాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతిఒక్కరూ స్నేహపూర్వక వాతావరణంలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించి వారిని మంచి మార్కులు ఉత్తీర్ణ శాతాన్ని పెంచే విధంగా తీర్చిదిద్దాలన్నారు. రాబోయే పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణశాతాన్ని సాధించాలని ఆ రకంగా ఇప్పటినుండి విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చేందుకు ప్రతి ఉపాధ్యాయుడు సంసిద్ధం కావాలని కోరారు. జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి చంద్రశేఖర్. చిత్తూరు ఎంఈఓ మోహన్, గుడిపాల ఎంఈఓ గణపతి, ఎంఈఓ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు గిరి రాజారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

34వ రోజూ కొనసాగిన విజయ డెయిరీ కార్మికుల రిలే దీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విజయ డెయిరీలో పనిచేసిన 140 మంది కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 34వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా కార్మిక సంఘం నాయకులు విజయ కుమార్ మాట్లాడుతూ విజయ సహకార డెయిరీలో పనిచేసిన 140 మంది కార్మికులు వీఆర్ఎస్ తీసుకోకుండా నేటి వరకు వేతనాల కోసం పోరాటం సాగిస్తున్నట్లు తెలిపారు. విజయ సహకార డెయిరీని అమూల్ సంస్థకు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం తమ వేతన బకాయిలను చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించేంతవరకు తమ రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామన్నారు. 34 రోజులుగా కార్మికులు జిల్లా కలెక్టరేట్ ఎదుట రిలేదీక్షలు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు.



కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేస్తున్న డెయిరీ కార్మికులు

స్పందనకు 251 అర్జీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. ప్రతి సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనలో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్‌తో జడ్పీసీఈఓ ప్రభాకర్ రెడ్డితో కలసి జిల్లా నలుమూలల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. స్పందనక మొత్తం 251 అర్జీలు రాగా ఇందులో శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 182, మండల లెవెల్ కో ఆర్డినేటర్ కమిటి 7, జిల్లా ఉపాధి కల్పన శాఖ 2, ఎండోమెంట్ శాఖ 1, డ్వామా 1, నగర పాలక సంస్థ 3, మండల ప్రజాపరిషత్, చిత్తూరు1, పోలీసు శాఖ 7, డిసిహెచ్‌ఎస్ 1, ఎపిఎస్ పిడిసిఎల్ 1, ఏడి సర్వే శాఖ 2, మండల ప్రజాపరిషత్ పెనుమూరు 1, మండల ప్రజాపరిషత్ తవణంపల్లి 1, హౌసింగ్ శాఖ 2, ఎక్సైజ్ 1, ఇండస్ట్రీస్ 1, డిఎస్–ఎల్ ఓ 2, డిఎస్‌ఓ 1, పంచాయతీ రాజ్ 2, డిఎఫ్‌ఓ 1, ఆర్‌డబ్ల్యూఎస్ 1, ఆర్అండ్ బి 1, సిరికల్చర్ 1, డిఆర్‌డిఏ 2, సిఎండి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 1, పెన్షన్, రేషన్ కార్డులు, ఇతరులు 25, అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓకు తమ వినతులను అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి: ఎస్పీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఎస్పీ, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎల్.సుధాకర్‌ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ త్వరితగతిన విచారణ జరిపి ఫిర్యాదుదారులకి న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో మొత్తం 20 ఫిర్యాదులు అందగా అందులో కుటుంబ తగాదాలు 2, వేధింపులు 6, ఇంటి తగాదాలు 1, భర్త వేధింపులు 2, భూ తగాదాలు 8, ఆస్తి తగాదాలు 1 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి

వేగంగా 'స్పందన' వినతుల పరిష్కారం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందన కార్యక్రమంలో అందిన వినతులను వేగంగా పరిష్కరించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ అరుణ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు ఇచ్చిన వినతులపై అక్కడికక్కడే అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసి సత్వరం నివేదిక అందించాలన్నారు. ఇప్పటివరకు అందిన వినతులపై శాఖాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈ స్పందన కార్యక్రమంలో ఇంజనీరింగ్ 4, టీపీవో 1, ప్రజారోగ్య విభాగం 2, రెవెన్యూ 1, అకౌంట్స్ 1 చొప్పున మొత్తం 9 వినతులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, అధికారులు పాల్గొన్నారు.



స్పందన లో అర్జీలు స్వీకరిస్తున్న నగర కమిషనర్ అరుణ

ఆరోగ్య కేంద్రాల్లోనే కాన్పులు జరగాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ ప్లాన్ (ఎన్‌హెచ్‌ఎం) టీం డాక్టర్ శ్రీనివాసరావు, న్యూఢిల్లీ, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ముఖ్యంగా మాతాశిశు మరణాల నివారణకు ప్రభుత్వం అనేక జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రవేశపెట్టడమైందని, ప్రతి కార్యక్రమాన్ని ప్రతి ప్రోగ్రాం అధికారి తప్పనిసరి బాధ్యతలతో విధులను నిర్వహించి మాత శిశు మరణాలు కలగకుండా అరికట్టాలని తెలిపారు. ప్రతి బిడ్డకు పూర్తి వ్యాధి నిరోధక టీకాలను అందించాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు జరిగేటట్లు చూడాలన్నారు. ప్రతి ఆసుపత్రిలో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ తప్పనిసరి చేస్తూ పద్ధతిగా డిస్పోజబుల్ చేసి ఎలాంటి దుర్వాసన లేకుండా చూడాలన్నారు. ఆసుపత్రిలో కావలసినంత మాన్ పవర్ ఉన్నందున ప్రతిఒక్కరు కచ్చితంగా పనిచేసినట్లయితే సమాజంలో ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. అబార్షన్లను ఆపి, లింగ వివక్షత నిర్ధారణ లేకుండా చూడాలన్నారు. సిహెచ్‌సిలో సి సెక్షన్ జరగాలన్నారు. ప్రతి కార్యక్రమాన్ని డిఎంహెచ్‌ఓ, డిసిహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో మానిటర్ చేయాలన్నారు. వీరు ఇంకో వారం రోజులపాటు వివిధ హాస్పటల్స్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ వెల్నెస్ సెంటర్స్‌లో మానిటర్ చేసి వివిధ కార్యక్రమాలపై నివేదిక తయారుచేసి ఎలా ఇంప్రూవ్ చేయాలో విశదీకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, డిఐవో డాక్టర్ రవి రాజు, డాక్టర్ మాధవి, డిపిఎంఓ డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ సందీప్, అందరూ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి దేవి

'మిషన్ శక్తి' అమలుకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

మహిళల భద్రత సాధికారత నిమిత్తం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్‌శక్తి కార్యక్రమంలో సంబంధిత శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో జిల్లాలో పటిష్ఠంగా అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన మిషన్‌శక్తి కార్యక్రమం అమలుకు సబంధించి సంబంధితశాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా జాయింట్ మాట్లాడుతూ మిషన్‌శక్తి కార్యక్రమం కేంద్ర మహిళా, శిశు అభివద్ధి మంత్రిత్వశాఖచే మహిళల భద్రత, సాధికారత నిమిత్తం అమలు చేయడం జరుగుతున్నదని తెలిపారు. ఈకార్యక్రమంలో సంబల్, సామర్థ్య అనే రెండు ఉపపథకాలు మహిళల సాధికారత భద్రత కోసం ఉన్నాయని తెలిపారు. అలాగే బేటి బచావో బేటి పడావో కార్యక్రమంను సవరించి మిషన్‌శక్తిగా అమలు చేయడం జరుగుతున్నదని తెలిపారు. మహిళల సాధికారతతోపాటు బాల్యవివాహాలను నిర్మూలించేందుకు జిల్లాలో ఏఏ మండలాలలో బాల్యవివాహాలు జరుగుతున్నది సర్వే జరిపి వీటి నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. మిషన్‌శక్తి కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు డివిజన్ స్థాయిలో కూడా సమన్వయ సమావేశాలను సంబంధితశాఖల సమన్వయంతో నిర్వహించాలని పిడి నాగ శైలజను ఆదేశించారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్యలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీ బాష, హౌసింగ్ పీడీ పద్మనాభం, చిత్తూరు డివైఈఓ చంద్రశేఖర్, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను జిల్లా జాయింట్ కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు.



మిషన్ శక్తి కార్యక్రమంపై సమీక్షిస్తున్న జెసి

ఎస్ఆర్‌పురం తహశీల్దార్‌గా బెన్నురాజు


తహశీల్దార్ బెన్నురాజు

ప్రజాశక్తి-ఎస్ఆర్‌పురం: మండల తహశీల్దార్‌గా బెన్నురాజు నియమితులయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల ప్రాధాన్యత ఇస్తామన్నారు.

నేడు డిప్యూటీ సిఎం పర్యటన

ప్రజాశక్తి-ఎస్ఆర్‌పురం: మండలంలోని కొత్తపల్లిమిట్ట గ్రామపంచాయతీలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపిడిఓ కృష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎపిఎస్ఐడిసి వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పాల్గొంటారన్నారు.

మొరాయిస్తున్న సర్వర్లు..
ఆందోళనలో ఖాతాదారులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: డిజిటల్ పేమెంట్ వ్యవస్థకు అలవాటు పడ్డ ప్రజలకు బ్యాంకు సర్వర్ మొరాయిస్తుండడంతో ఆందోళనకు గురవుతున్నారు. గత మూడు రోజులుగా ఎస్‌బిఐ సర్వర్ డిజిటల్ పేమెంట్ యాప్‌లో నిలిచిపోవడంతో అటు వ్యాపారులు, ఇటు ఖాతాదారులు ఇబ్బంది పడుతున్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఆసుపత్రికి గీజర్ వితరణ


గీజర్‌ను అందజేస్తున్న దాతలు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని ఠాగుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి దాతలు గీజర్‌ను అందజేశారు. చిత్తూరుకు చెందిన కేశవులురెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, ఆయన తల్లి ఉమాదేవి చేతుల మీదుగా గీజర్‌ను సోమవారం డాక్టర్ దివ్య, ప్రశాంత్‌లకు అందజేశారు. కార్యక్రమంలో దాత సోదరులు నిరంజన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా రెడ్ క్రాస్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసమూర్తి, ట్రెజరర్ జమీర్, మండల రెడ్ క్రాస్ అధ్యక్షుడు పాపిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం


ప్రమాణం చేయిస్తున్న ఏ.పి.ఎం క్రిష్ణప్ప

ప్రజాశక్తి-పెద్దపంజాణి: గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించి బాల్య వివాహాలను నిర్మూలిద్దామని ఏ.పి.ఎం క్రిష్ణప్ప అన్నారు. సోమవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బాల్యవివాహాల నిరోధించడానికి గ్రామ అధ్యక్షురాళ్లతో ప్రమాణము చేయించారు. క్రిష్ణప్ప మాట్లాడుతూ బాల వివాహాలు అరికట్టేందుకు గ్రామ స్థాయి ప్రజలందరికీ అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన వివరించారు.

కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాబు


ఆర్.బాబును సన్మానిస్తున్న నేతలు

ప్రజాశక్తి-నగరి: నగరికి చెందిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.బాబును నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ నుంచి ఉత్తర్వులు అందాయి. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆర్.బాబు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో పార్టీ పదవి రావడానికి సహకరించిన ఏఐసిసి ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నేతలు ఆయనను దుశ్శాలువతో సత్కరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ భానుమూర్తి, పీసీసీ సభ్యులు నటరాజమొదలియార్, నాయకులు చిరంజీవిరెడ్డి, అల్లాబెట్టి, దేశయ్య, నాగేశ్వరరావు,కుమార్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ధరణి' పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నగరి: ధరణి డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోఆపరేటివ్ సహకార బ్యాంకు మేనేజరు జె.సందీప్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆకర్షక వడ్డీరేట్లు ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు 9949826948 నెంబరును సంప్రదించాలన్నారు.

కనకదుర్గమ్మకు రాగి చెంబు విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కనకాచలం పై వెలిసిన దుర్గమ్మకు దేవి నవరాత్రుల సందర్భంగా చుక్కల నిడిగల్లు గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి రాగి చెంబు విరాళంగా అందజేశారు. సోమవారం కొండపైన ఆలయానికి వెళ్లి దుర్గమ్మ ఆలయ ప్రధాన అర్చకుడు ఉమాపతి చేతుల మీదుగా అమ్మవారికి ప్రతి రోజూ చేసే అభిషేకం కోసం రాగి చెంబును అందజేసినట్లు వెంకటలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో లీల, సునీత తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నాయకునికి మాతృ వియోగం

ప్రజాశక్తి - పిచ్చా టూరు: పిచ్చాటూరు మండల సిపిఎం నాయకులు రామచంద్రారెడ్డి తల్లి జె సంపూర్ణమ్మ (92) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. వారి మృతికి సిపిఎం తిరుపతి జిల్లా కమిటీ తరఫున, సత్యవేడు నియోజకవర్గం తరఫున సంతాపాన్ని తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలుపుతూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని నాయకులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం వారి స్వగ్రామమైన కారూరులో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

వైసిపి ఇంటింటి ప్రచారం పై శిక్షణ

ప్రజాశక్తి - బాలాయపల్లి: ఇంటింటి ప్రచారంపై శిక్షణకు బాలాయపల్లి మండల వైసిపి నాయకులు ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపిటిసీలు, జేసీఎస్ మండల ఇన్‌ఛార్జ్, పీఏసీఎస్ అధ్యక్షులు, సర్పంచ్ లు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ మండల, గ్రామ స్థాయి నాయకులు, సచివాలయ కన్వీనర్లు,గృహ సారథులు, సోషల్ మీడియా కమిటీ,సచివాలయం సోషల్ మీడియా సభ్యులు ఈ సమావేశానికి హాజరు కావాలని మండల వైసిపి అధ్యక్షుడు, జయంపు, సహకార సంఘం అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెద్దపంజాణి: అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. సోమవారం మండలంలోని కోగిలేరు సచివాలయ పరిధిలో ఆయన పర్యటించారు. గ్రామాలలోని నూతన సచివాలయం, ఆర్‌బికె, పాఠశాల భవనాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామన్నారు. పారదర్శకంగా పథకాలు అమలుకు పటిష్ట వ్యవస్థను తీసుకొచ్చామన్నారు. ప్రభుత్వ చిత్తశుద్ధిని గుర్తించి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. వాల్మీకుల విన్నపం మేరకు వాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సలహా సభ్యులు డా.చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ రెడ్డప్ప, జడ్పిటిసి సుప్ప శీర్తి, మండల కన్వీనర్ బాగారెడ్డి, నాయకులు జి.డి.బాబు, అంజమ్మ, తమ్మిరెడ్డి, శంకరప్ప, రమేష్, హరినాథ్ పాల్గొన్నారు.

ఇంటర్ అర్హతతో
వీఆర్‌ఏలకు ప్రమోషన్ కల్పించాలి


చిత్తూరు జిల్లా వీఆర్‌ఏ సంఘం అధ్యక్షులు కోదండ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇంటర్మీడియట్ అర్హతతోనే వీఆర్‌ఏలకు ఉద్యోగ్యోన్నతులు కల్పించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు కోదండ, బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 13 అనుసరించి ఇంటర్మీడియట్ అర్హతతో 3795 మంది వీఆర్‌ఏలకు ఉద్యోగ్యోన్నతులు కల్పించారన్నారు. అలాగే జీవో నెంబర్ 104 ప్రకారం మిగిలిన సీనియార్టీ జాబితాలో ఉన్నవారికి డిగ్రీ అర్హతతో ఉద్యోగ్యోన్నతులు కల్పిస్తామని జీవో జారీ చేయగా వారు హైకోర్టును ఆశ్రయించారని, హైకోర్టు సిసిఎల్‌కు ఇంటర్మీడియట్ అర్హతతోనే ఉద్యోగ్యోన్నతులు కల్పించాలని ఉత్తర్వులు జారీచేసినట్లు వెల్లడించారు. ఈ ఉత్తర్వుల మేరకు ఇంటర్మీడియట్ అర్హతతోనే పదోన్నతులు కల్పించాలని వీఆర్‌ఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎంసెట్ మూడవ విడత కౌన్సెలింగ్‌ను నిర్వహించాలి

ప్రజాశక్తి -గూడూరు: రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన ఎంసెట్ 3వ విడత కౌన్సెలింగ్ వెంటనే నిర్వహించి విద్యార్థుల ప్రాణాలు కాపాడాలని టీఎన్ఎస్ఎఫ్ గూడూరు శాఖ ఆర్డీఓ ఎం కిరణ్ కుమార్ కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. టీఎన్ఎస్ఎఫ్ పట్టణాధ్యక్షులు లల్లూ యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎంసెట్ కౌన్సెలింగ్‌ని 3 విడతలుగా జరిపాయని కానీ జగన్ సర్కార్ 3వ విడత కౌన్సెలింగ్ ని రద్దు చేయడం ఏంటో అర్థం కావటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పండు, వసీం ఖాజా, మహేష్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు విడుదల చేయండి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: స్వచ్ఛభారత కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేసి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఏఐటియుసి నాయకులు పిచ్చాటూరు ఎంపిడివో శ్రీనివాసులుకు సోమవారం కార్మికులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఏఐటియుసి జిల్లా కార్యదర్శి అన్నదాని మాట్లాడుతూ సత్య వేడు నియోజకవర్గం లోని స్వచ్ఛభారత కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేసి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన డిమాండు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశం మేరకు మార్కెట్ పనికి తగ్గ సమాన వేతనం కల్పించాలని చెబుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధా కరమన్నారు. ఇప్పటికైనా పెండింగ్ బకాయిలు విడుదల చేసి వాళ్ల కుటుంబాలను ఆదు కోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధం శెట్టి చంద్రబాబు, ముని చంద్ర, శాంతి, సరళ, జ్యోతి, చిరంజీవి, ఆనందయ్య ,గోవిందయ్య పాల్గొన్నారు.

18న శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో స్పాట్ అడ్మిషన్స్ కోసం దరఖాస్తులను ఈ నెల18వ తేదీనుంచి ఆహ్వానిస్తోంది. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి నాక్ ఏ గ్రేడ్, అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించి ఖ్యాతి గడించిన విషయం అందరికి తెలిసిందే. విద్యార్థులకు, మహిళలకు సాంకేతికాభివృద్ధి కోసం అధునాతన పరికరాలు కలిగిన ప్రయోగశాలలు , సరికొత్త ఆవిష్కరణలు పొందడానికి క్రియాశీలక కేంద్రాలను కలిగి వుంది. విద్యార్థినులు ఆన్ క్యాంపస్ డ్రైవ్ ద్వారా ఉద్యోగ అవకాశాలు మెండుగా పొందుతున్నారు. విద్యార్థినుల భద్రత కోసం మహిళా రక్షణ కేంద్రం, మహిళలకు విద్యార్థినులకు హస్త కళాఉత్పత్తుల శిక్షణ కోసం శిక్షణా కేంద్రం వుంది. ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, ఇంటిగ్రేటెడ్ ఫుడ్ టెక్నాలజీ , ఒకేషనల్, న్యూట్రిషన్ అండ్ హెల్త్ కేర్ సైన్సెస్ , ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ అప్పారాల్ డిజైన్ , మాస్టర్స్ ఇన్ ఫైన్ ఆర్ట్స్ కోర్సులతో పాటు కొత్తగా ప్రవేశపెట్టిన బాచిలర్స్ ఆఫ్ సైన్స్ ఇన్ స్టాటిస్టిక్స్ బాచిలర్స్ కోర్స్ ఇన్ సోషల్ వర్క్ కోర్సులకు ఈ నెల 18వతేదీన స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నారు. అర్హత కలిగిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య సువర్ణలతా దేవి తెలిపారు. వివరాల కోసం డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్‌పిఎంవివి.ఎసి.ఇన్ వెబ్ సైట్ ని సందర్శించాలన్నారు.

గృహ విజ్ఞాన శాస్త్రంలో మౌనికకు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలోని గృహ విజ్ఞాన శాస్త్ర పరిశోధక విద్యార్థి దక్షిణపు మౌనికకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. గృహ విజ్ఞాన శాస్త్ర సహాయ అచార్యులు డాక్టర్ జి శిరీష పర్యవేక్షణలో 'మిల్లెట్స్ యాంటీ న్యూట్రియంట్స్ అండ్ దెయిర్ థెరపుటిక్ ఎఫెక్ట్ ఆన్ మెటబాలిక్ సిండ్రోమ్' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు డి.మౌనికకు విశ్వవిద్యాలయ పరీక్షల విభాగం డాక్టరేట్‌ను ప్రదానం చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రస్తుతం సమాజంలో ఓ ప్రధాన ఆరోగ్య సమస్యగా ఉన్న మెటబాలిక్ సిండ్రోమ్ నియంత్రణ కు చిరుధాన్యలను వినియోగించడం, చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మెటబాలిక్ సిండ్రోమ్ వ్యాధులను అధిగమించవచ్చని పరిశోధనల్లో శాస్త్రీయంగా గుర్తించారు. ఈమె పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ లలో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించినట్లు వెల్లడించారు. మౌనికకు డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాలకు అటానమస్ హోదా

ప్రజాశక్తి - క్యాంపస్

టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీగోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 10 సంవత్సరాల పాటు అటానమస్ (స్వయంప్రతిపత్తి) హోదా మంజూరు చేసింది. తద్వారా కళాశాల అభివృద్ధికి స్వతహాగా నిర్ణయాలు తీసుకునే అవకాశం కలుగుతుంది. విద్యావిధానం, పరీక్షల నిర్వహణ, పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా సిలబస్ సిలబస్ లో మార్పులు చేసుకోవడం వీలవుతుంది. దీంతోపాటు సామాజిక సేవా దృక్పథంతో విద్యా బోధన, ఆధునిక సాంకేతికత ఆధారంగా కోర్సుల నిర్వహణ, మెమరీ బేస్డ్ విద్యావిధానం ఏర్పాటుకు వెసులుబాటు కలుగుతుంది. ప్రాంగణ ఎంపికలకు ప్రపంచ స్థాయి సంస్థలు ముందుకు వస్తాయి. 1969లో ఏర్పాటు అయిన ఈ కళాశాలలో నిపుణులైన అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారు. మొత్తం 2,200 మంది విద్యార్థులు చదువుతుండగా, వీరిలో 1500 మందికి హాస్టల్ వసతి కల్పించారు. కళాశాలలో 19 విభాగాలు, 19 కోర్సులతో అధునాతన వసతులు అందుబాటులో ఉన్నాయి. ఈ కళాశాల ఇటీవల తొలి ప్రయత్నంలోనే నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించడం విశేషం.

చైర్మన్, ఈవో అభినందన

టీటీడీకి చెందిన శ్రీగోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలకు అటానమస్ హోదా లభించడానికి కృషి చేసిన టీటీడీ జెఈవో సదా భార్గవిని, విద్యాశాఖాధికారి డా. ఎం.భాస్కర్ రెడ్డిని, కళాశాల ప్రిన్సిపాల్ డా. వేణుగోపాల్ రెడ్డిని, కళాశాల అధ్యాపక బృందాన్ని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

క్రైం కార్నర్

సహచరుడిపై దాడి
- వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నగరి: కూలీల మధ్య ఏర్పడ్డ తగవులో కూలీపై మరో కూలీ దాడి చేయడంతో వలస కూలీ మృతి చెందిన సంఘటన సోమవారం నగరి మండలంలో వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని దామరపాకకు చెందిన రైతు పొలంలో చెరుకు కత్తరించేందుకు విశాఖపట్టనం జిల్లా పాయకారావుపేట నుంచి కూలీలను పిలిపించాడు. ఆదివారం రాత్రి కూలీలు పొలంలో భోజన సమయంలో చిన్నపాటి తగవు ఏర్పడింది. వారిలో ఆవేశానికి గురైన పసుపురెడ్డి అప్పన్ సత్యాబాబుపై కర్రతో తలమీద దాడి చేశాడు. తీవ్రగాయాలతో ఉన్న సత్యాబాబుని సహచరులు నగరి ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం సత్యాబాబు మృతి చెందాడు. సంఘటనపై కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కుళాయప్ప తెలిపారు.

యువకుల మధ్య ఘర్షణ
- ఒకరికి కత్తిపోటు

ప్రజాశక్తి-నగరి: స్థానిక బస్టాండు ప్రాంగణంలో ఆదివారం రాత్రి యువకుల మధ్య ఘర్షణ జరిగింది. ఘటనలో అజిత్(23)అనే యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడు చేశాడు. తీవ్రంగా గాయపడిన యువకుడిని స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి తీవ్రంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. ప్రస్తుతం అజిత్ చికిత్స పొందుతున్నాడు. సంఘటనపై పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీల ద్వారా దాడికి పాల్పడ్డ నింధితులను గుర్తించే పనిలో ఉన్నారు. విచారణ అనంతరం వివరాలను వెళ్లడిస్తామని ఎస్ఐ కుళాయప్ప తెలిపారు.

శెట్టిపల్లిలో చోరీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లి లోని ఓ ఇంటిలో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తుల చొరబడి చోరీకి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి వెలుగు చూసింది. అలిపిరి పోలీసుల కథనం మేరకు.. శెట్టిపల్లి గ్రామంలో పాపయ్య పెయింట్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సమీప బంధువుల శుభకార్యాలు కావడంతో శనివారం ఇంటికి తాళాలు వేసి ఊరికి వెళ్లాడు. ఆదివారం రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఇల్లంతా చిందరవందగా ఉంది. చోరీ జరిగిందని భావించి పోలీసులకు సమాచారం అందించారు. అలిపిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. ఇంటి బీరువాలో ఉంచిన 30 గ్రాములు బంగారు, 50 వేల రూపాయల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- రేణిగుంట : తిరుపతి చెన్నై జాతీయ రహదారి గాజుల మండ్యం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శివకుమార్ (27) మృతి చెందాడు. గాజుల మండ్యం ఎస్సై ధర్మారెడ్డి కథనం మేరకు తిరుపతి హరిత కాలనీ చెందిన శివకుమార్ అతని బామర్ది ఏలుమలై ద్విచక్ర వాహనంలో తిరుత్తణి కి వెళ్లి దైవ దర్శనం చేసుకుని తిరుగు పయనమయ్యారు. ద్విచక్ర వాహనం గాజులమండ్యం వద్దకు వచ్చేసరికి స్పీడ్ బ్రేకర్ ను ఎక్కించగానే అదుపుతప్పి రోడ్డు మీద పడ్డారు. అదే సమయంలో తిరుపతి వైపు నుండి చెన్నై వైపు వెళ్లే లారీ రోడ్డు మీద పడ్డ శివ కుమార్‌పై దూసుకుపోయింది. ప్రమాదంలో శివ కుమార్ తల ఛిద్రమైంది. అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న ఏలుమలై గాయాలతో బయటపడ్డాడు. శివకుమార్ మృతి వార్త తెలుసుకున్న కుటుంబీకులు మృతదేహం వద్ద ఆర్తనాదాలతో కన్నీరు మున్నీరయ్యారు. మృతుడు శివకుమార్ కు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్ద చనిపోవడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలు నిషేధంపై ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : బాల్య వివాహాలు చట్ట పరమైన నేరమని ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ దాన్ని పాటించాలని సర్పంచి వీరితా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. మండలం రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ లోని గ్రామ సచివాలయ భవనం వద్ద గ్రామ సర్పంచ్ విరిత దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బాల్య వివాహాలు నిషేధంపై ప్రతిజ్ఞ నిర్వహించారు. సర్పంచి విరిత దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల చిన్న వయసులోనే కుటుంబ బాధ్యతల తో ఇబ్బందులు పడతారన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మండల వైస్ ఎంపీపీ మునుస్వామి రెడ్డి, గ్రామ పంచాయతీ అధికారులు, గ్రామ వాలంటీర్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సంఘ మిత్రలు, రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

ముమ్మరంగా జివిఆర్ సర్వే

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: వల్లంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు జీవీఆర్ సర్వేను ముమ్మ రంగా నిర్వ హిస్తున్నారని ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. సోమవారం ఆయన బుచ్చినాయు డు కండ్రిగలోని సచివా లయంలో చేపట్టిన జీవీఆర్ సర్వేను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉన్నారా? లేదా అంచనా వేసి డ్రాఫ్ అవుట్స్‌ను గుర్తించి పాఠశాలలో చేర్పించటం జీవీఆర్ సర్వే ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. బడి మధ్యలో పాఠశాలకు వెళ్లకుంటే వారిని గుర్తిస్తామన్నారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వైజెపి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు, సరుకులు పంపిణీ చేశారు. సోమవారం గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఎస్ఎల్ఎన్ స్వామి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా క్లబ్ పర్మినెంట్ ప్రాజెక్టు డాక్టర్ సిఆర్ రెడ్డి ఫల సరుకులు పంపిణీ ప్రతి నెలా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి , వరిది రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి , మాజీ రీజియన్ చైర్మన్ ఆర్‌విరావు , మాజీ అధ్యక్షుడు మురళి రాజు, సభ్యులు పసుపులేటి ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


విశేష పూజలతో అమ్మవారు

ప్రజాశక్తి - కార్వేటినగరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం బంగారమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణ జరిగింది. కామాక్షిదేవి అవతారంలో అమ్మవారు దర్శన మిచ్చారు.

బంగారుపాళ్యం: స్థానిక రాజావీధిలోని ముత్యాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆలయ పండితులు విశేష పూజలు నిర్వహించారు.

మల్లేశ్వరస్వామికి విశేష పూజలు

వెదురుకుప్పం: మండలంలోని అరుణగిరి కొండ మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పురస్కరించుకొని విశేష పూజలు జరిగాయి. అర్చు కులు స్వామి వారికి అభిషేకాలు, అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

రామకుప్పం: మండలంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమ వారోత్సవాలు నేత్ర పర్వంగా జరిగింది. నాలుగవ సోమవారం స్వామి వారికి వివిధ పుష్పాలతో అలంకరించి అభిషేకాలు నిర్వహించి భక్తాదులకు దర్శన ఏర్పాట్లు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

'అక్రమ కేసులు పెట్టి ఆనందిస్తున్నారు'



ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయించి జగన్ ఆనందిస్తున్నారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. మండలంలోని బట్టందొడ్డి పంచాయితీలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి పాలనలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబుపై అన్యాయంగా కేసు పెట్టి జైలులో పెట్టారన్నారు. అనతరం రామాపురంలో టిడిపి జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆనంద్‌కుమార్, చలపతి, రుద్రమూర్తి నాయుడు, భానుప్రతాప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

చంద్రబాబు ఆరోగ్యం కుదుటపడాలని పూజలు

రామకుప్పం: చంద్రబాబు ఆరోగ్యం కుదుటపడి ఆయన ఆరోగ్యంగా ఉండాలని టిడిపి శ్రేణులు ఆలయాల్లో పూజలు చేశారు. రామకుప్పం మండలంకి చెందిన మాజీ ఎంపిపి హేమలత, ఆంజనేయరెడ్డి దంపతులు తెలంగాణ రాష్ట్రం భువనగిరిలో స్వర్ణలింగానికి పూజలు చేసినట్లు తెలిపారు.

వి.కోట: మండలంలోని బసవేశ్వరస్వామి ఆలయంలో టిడిపి నేతలు పూజలు నిర్వహించి అన్నదానం చేపట్టారు.

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రజా ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే ఎం ఎస్ బాబు అన్నారు. సోమవారం మండలం లోని వెలుతూరు సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర పాలఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, జెడ్పిటిసి సోమశేఖర్ నాయకులు శిరీష్‌రెడ్డి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


గంగాధరనెల్లూరు: మండలంలోని మహాదేవమంగళంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. 471 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పెనుమూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేలుమొదలి, తహశీల్దార్ ఇన్బనాధన్ తదితరులు పాల్గొన్నారు.

నగరి: మండలంలోని ఎం.కొత్తూరు సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కారక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆర్‌కె రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. వైద్య సేవలను ఆయన పర్యవేక్షిం చారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, నాయకులు కన్నియప్ప, డిల్లి, దస్తగిర్, ఎంపీడీవో లీలామాధవి, సీడీపీవో కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వి.కోట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందని జెడ్పి చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని బోడిగుడ్లపల్లిలో సోమవారం నిర్వహించి వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు.

చౌడేపల్లి: మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ శ్రీరాం, వరుణ్, భరత్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపిపి రామ్మూర్తి, జెడ్పిటిసి దామోదర్ రాజు, వైసిపి కన్వీనర్ అంజిబాబు పాల్గొన్నారు.

బోయకొండ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటి సభ్యులు

ప్రజాశక్తి-చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయంలో నూతన కమిటీ కార్యవర్గం కొలువు తీరింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా నాగరాజరెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చిత్తూరు ఎంపి రెడ్డప్ప, వైసిపి రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డిల సమక్షంలో ఈవో చంద్రమౌళి ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా నాగరాజురెడ్డి, సభ్యులుగా రాజేష్, పవన్‌కుమార్, రజిని, రాందాస్, భారతి, బుడ్డమ్మ, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మ, హైమావతి, రెడ్డెమ్మ, ఎక్స్ అఫిషియో సభ్యులుగా ప్రధాన అర్చకులు గంగిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. నాయకులు అంజిబాబు, భాస్కర్‌రెడ్డి, రామ్మూర్తి పాల్గొన్నారు.

గ్లోబల్ ఫ్రీ జోన్ ఆఫ్ ది ఇయర్‌గా శ్రీసిటీ

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో 'అత్యుత్తమ గ్లోబల్ ఫ్రీ జోన్ ఆఫ్ ది ఇయర్'గా శ్రీసిటీకి గుర్తింపు దక్కింది. ఎఫ్‌డిఐ ఇంటెలిజెన్స్ సంస్థ వారి 'గ్లోబల్ ఫ్రీ జోన్స్ ఆఫ్ ది ఇయర్ 2023' 10వ ఎడిషన్ లో శ్రీసిటీకి ఈ ప్రత్యేక గుర్తింపు లభించింది. ఎఫ్‌డిఐ ఇంటెలిజెన్స్ అనేది ప్రపంచంలోని పారిశ్రామిక జోన్లు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించి అత్యంత ప్రాచుర్యం కలిగిన ప్రచురణ సంస్థ. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు అనువైన కేంద్రాలు, వ్యాపార విస్తరణ, ఆర్థిక అభివద్ధికి మెండైన అవకాశాలు కలిగిన ప్రాంతాలను ఇది గుర్తిస్తుంది. ఈ ఏడాది 90 దేశాల్లోని 4921 వ్యాపార కేంద్రాలను పరిగణనలోనికి తీసుకుని, పలు విభాగాలలో ఉత్తమ జోన్ లను ఈ సంస్థ గుర్తించింది. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

చక్కెర ఫ్యాక్టరీ ఏజెంట్ల దోపిడీని అరికట్టండి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్ : తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై పరిసరాల్లోని బన్నారి, ఈ. ఐ . డి, ప్యారీ, రాజేశ్వరి తదితర సుగర్ ఫ్యాక్టరీల ఏజెంట్లు రైతుల్ని విపరీతంగా మోసం చేస్తున్నాయని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి హేమలత ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో గతంలో ఆరు ఫ్యాక్టరీలు ఉండేవని, ప్రస్తుతం ఒక్కటి మాత్రమే నడుస్తోందన్నారు. దీన్ని అదునుగా తీసుకుని తమిళనాడు, జిల్లాలోని కొంతమంది ఏజెంట్లుగా ఏర్పడి రైతుల వద్ద టన్నుకు 2వేల రూపాయలకు కొనుగోలు చేసి తమిళనాడుకు తరలిస్తున్నారన్నారు. టన్నుకు ఐదువేల రూపాయలు ఇవ్వాలని రైతుసంఘాలు మొరపెట్టుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి లేదని వాపోయారు. జిల్లాలో మూతబడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించి చెరకు రైతులను ఆదుకోవాలని కోరారు.

హాకీ విజేతగా తిరుపతి సర్కిల్ జట్టు


పోటీల్లో విజేతలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్స్ ఉద్యోగుల ఇంటర్ సర్కిల్ హాకీ, బాస్కెట్ బాల్, షటిల్ పోటీల్లో భాగంగా ఈనెల 14 నుంచి జరిగిన హాకీ పోటీల్లో తిరుపతి సర్కిల్ మొదటి స్థానంలో నిలిచింది. ఇక కడప సర్కిల్, నెల్లూరు సర్కిల్ జట్లు సంయుక్తంగా ద్వితీయ స్థానంలో నిలిచాయి. అదేవిధంగా షటిల్ విభాగంలో బాస్కెట్ బాల్ పోటీల్లో రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్ టి పి పి) జట్టు మొదటి స్థానంలోనూ, డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (డాక్టర్ ఎన్ టి టి పి ఎస్) జట్టు ద్వితీయ స్థానంలోనూ, ఏపీఎస్పీడీసీఎల్ నెల్లూరు సర్కిల్ జట్టు తతీయ స్థానంలోనూ నిలిచాయి. షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో ఏపీ జెన్కో కష్ణపట్నం జట్టు మొదటి స్థానంలోనూ, ఆర్టిపిపి ద్వితీయ స్థానంలోనూ, ఏపీఎస్పీడీసీఎల్ నెల్లూరు సర్కిల్ జట్టు తతీయ స్థానంలోనూ నిలిచాయి. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు హెూల్ టైం ఉమెన్ డైరెక్టర్ పి.బి. శశికళ చేతుల మీదుగా ట్రోఫీలు, సర్టిఫికెట్లను బహుకరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, డి.ఎస్. వరకుమార్, డీ.వి. చలపతి, స్పోర్ట్స్ ఆఫీసర్ కుమార వడివేలు, ఎస్పీడీసీఎల్ తిరుపతి స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ యం. కష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వాసుదేవరెడ్డి, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రతినిధులు వాసురెడ్డి, పురుషోత్తం, లీలారామ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అమర్ బాబు, పద్మనాభ పిళ్ళై, శ్రీనివాసమూర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు.